చేసుకుంటుంటే.. నువ్వేమో బాబు మలమూత్రాలు కడుగుతూ గడిపావు. అవునా కాదా!? అసలు నిన్నో మనిషిలా చూశారా వాళ్లు. ఫ్రీగా వచ్చిన ఆయమ్మలా చూశారు తప్ప. అయినా మళ్లీ వెళ్లేందుకు సిద్ధమవుతున్నావా!?'' కృష్ణలీలయ్యకు భార్య పరిస్థితి చూసి జాలేసింది.

''మనం కాకపోతే ఇంకెవరు చేస్తారండీ వాళ్లకు.. పాపం!'' భర్త చెప్పినదాంట్లో అణువణువూ నిజమే ఉన్నా.. కూతురికి 'రాను!' అని చెప్పలేని బలహీన స్థితిలో పడిపోయింది మధురమ్మ. తల్లి మనసు కదా. పిల్లలు ఏమన్నా.. ఏం చేసినా.. పడివుండేలా తయారైంది మరి.

''చూడు అమ్మడూ! ఇప్పటికే నువ్వు మన సంతానానికి చాలా సేవలు చేశావు. రాత్రనకా పగలనకా వాళ్లకు నానా చాకిరీ చేశావు. కనీసం నీతో అయినా వాళ్లు వారంవారం.. పోనీ నెలకోసారి ఫోన్లు చేసి మాట్లాడతారా! నువ్వు చేస్తే ఫోన్ ఎత్తుతారా? వాళ్లంతా బిజీ మరి. మనం మాత్రం ఖాళీగా దోమలు, ఈగలు తోలుకుంటూ ఉన్నాం. సరే అదంతా పక్కనబెట్టు.. నువ్వు వెళ్లడం నాకిష్టం లేదు. నీకు నేను కావాలో, పిల్లలు కావాలో తేల్చుకో!'' అని తేల్చిచెప్పి బయటకు వెళ్లిపోయాడు కృష్ణలీలయ్య.

మధురమ్మకు ఏం చేయాలో తోచలేదు. అలా గుమ్మం దగ్గర కూర్చుండిపోయింది. పరిసరాలను గమనిస్తూ గతానికి వెళ్లిపోయింది.

* * *

చిన్న వయసులోనే భర్తతోపాటు అడుగుపెట్టిన పచ్చగా సింగారించుకున్న గడప. దానికి ఇరువైపులా గజేంద్రుల ప్రతిరూపాలు. చిన్న పాత్రలో ఆరోజు తోటలో విచ్చుకున్న ఎర్రని గులాబీలు, తెల్లని జాజులు. ఇంటి ఎదుట కళ్లాపి చల్లి వేసిన పదహారు చుక్కల ఏడు వరసల అందాల ముగ్గు. ఒకవైపు ఏపుగా పెరిగిన జామ, మామిడి, సపోటా చెట్లు. మరో వైపు ఆకుకూరలు, కూరగాయల మొక్కలు. తాను ఎంతో ఇష్టంగా చేయించుకున్న తులసికోట. అందులో రాధాకృష్ణుల రాతి విగ్రహం.




కాస్త దూరంలో మల్లెపందిరి. దాని కిందే నులక మంచం, మట్టికుండలో నీళ్లు. ఆ మంచంపై కూర్చుని భర్త వార్తాపత్రిక చదువుతుంటే తాను వింటూ ఎన్ని మల్లెదండలు కట్టిందో తనకే తెలీదు. కొన్ని గుడికి పంపితే మరికొన్నిటిని ఇంట్లో పూజకు వాడేది. ఎన్నిసార్లు తలలో పెట్టుకోమని భర్త చెప్పినా.. పువ్వులన్నీ భగవంతుడికే చెందాలని తాను చెప్పేది. అయినా భర్త ఊరుకుంటేనా.. ఒకటో రెండో మల్లెలను తెంపి తన తలలో ప్రేమగా పెట్టేవాడు.

అత్తగారింట్లో గంపెడు సంతానం. పెద్ద ఇల్లు. ఒక్కొక్కరుగా అత్తామామ, మతిస్థిమితం లేని మరిది చనిపోవడంతో.. ఇంటి బాధ్యతంతా తనపై పడింది. చిన్నతనంలోనే పెద్దరికం వచ్చేసింది. ఈ క్రమంలోనే ఒక్కొక్కరుగా పిల్లలు పుట్టడంతో వారిని చూసుకోవడం కష్టంగా మారింది. భర్త ఉద్యోగరీత్యా పలు ఊళ్లలో ఉద్యోగాలు చేయాల్సి రావడంతో.. తన టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసేసింది. పిల్లలను తానే పూర్తిగా చూసుకోవడం మొదలుపెట్టింది. నాన్న.. వాళ్లకో మనీ మెషీన్‌లా అనిపించసాగాడు. తాను పస్తులుండి పిల్లలను ఉన్నతస్థితికి తీసుకువచ్చాడు. తాహతుకు మించినా వాళ్లు కోరిన చదువులు చదివించి వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడేలా చేశాడు. కానీ, ఇప్పుడు రెక్కలు రాగానే వాళ్లు తల్లిదండ్రుల సేవలను మరచిపోయారు. అవసరాలకు అమ్మను వాడుకుంటున్నారు. నాన్నతో ఇక పనేలేదు కాబట్టి ఆయనను ఒక్కసారి కూడా విదేశాలకు తీసుకువెళ్లింది లేదు. గతంలో ఇలాగే కాన్పు కోసం భర్తను వదిలి విదేశాలకు వెళ్లొచ్చేలోపు ఆయన సమయానికి సరైన తిండిలేక అనారోగ్యం పాలయ్యారు. ఈసారి అస్సలే వెళ్లకూడదని భర్త చెప్పనే చెప్పాడు. కానీ, తాను వెళ్లకపోతే పిల్లలు చంటిపిల్లలతో అన్ని పనులు ఎలా చేసుకోగలరు? వారికి కృతజ్ఞతాభావం లేదు కానీ.. పేగుబంధం తనను ఇక్కడ నిలవనివ్వగలదా! ఎటూ తేల్చుకోలేక మౌనంగా ఉండిపోయింది.

అప్పుడే..

''అక్కా అక్కా! ఎలా ఉన్నావు?'' అంటూ పలకరించేందుకు వచ్చింది పక్కింటి చెల్లెమ్మ వర్ధమ్మ.

''రా.. రా.. నేను బాగానే ఉన్నాను. నీ సంగతులు ఏంటి? అమెరికా నుంచి ఎప్పుడొచ్చావేమిటి?'' అంటూనే కాఫీ కలుపుకొని తీసుకొచ్చింది.

''వారం కిందే వచ్చానక్కా. వెళ్లేముందు ఆరు నెలలకు సరిపడా ఇక్కడంతా సిద్ధంచేసి వెళ్లాలా.. మళ్లీ అక్కడ చాకిరీ. అదిచేసి ఇక్కడికి వచ్చేసరికి ఇల్లంతా చెత్తా చెదారం. అంతా శుభ్రం చేసుకుని మళ్లీ ఓ స్థితికి తీసుకొచ్చేసరికి నా చావుకు వచ్చింది. అయినా మనకే డ్యూటీలు ఏంటక్కా. పోనీ అక్కడ మనకేమన్నా రాజభోగాలు ఉన్నాయా అంటే.. ప్రతీదానికి 'నీకు ఇది తెలీదు. అది తెలీదు' అంటూ సూటిపోటి మాటలు. గొడ్డు చాకిరీ చేసినందుకు కనీసం కృతజ్ఞతలు చెప్పిన పాపానపోరు. అరే.. 'ఇండియా తిరిగెళ్తున్నాం. ఇరుగుపొరుగులు బంధువులు అడుగుతారు.. ఓ చాక్లెట్ ప్యాకెట్టు కొనివ్వవే!' అంటే .. 'ఎందుకూ దండగ!' అంది నా ముద్దుల కూతురు. పైగా.. నా టిక్కెట్టుకే లక్షల్లో ఖర్చయ్యిందని ఈసడింపులు. నేనేమన్నా పంపమన్నానా.. లేక అమెరికా చూడాలని తహతహలాడానా. వాళ్ల అవసరం కాబట్టి వాళ్లు టికెట్టు తీసి పంపించారు. మనం సరదాగా వస్తామంటే రానిస్తారా ఏంటి'' ఊపిరి తీసుకోకుండా గలగలా మాట్లాడేసి.. కాఫీ